# మానవత్వం

డివిజన్ ఆఫీసులో అడుగు పెట్టేసరికి పదిన్నరయింది ... ఆఫీసు జనరల్ హాల్లో ప్రవేశించా. గుమాస్తా లందరూ తలలు వంచుకొని పనులు చేసుకొంటున్నారు.

ఎదురుగా పెద్ద టేబిలూ, ఆ టేబిలుమీద ఫోనూ, వెనుక నున్న గోడకు పెద్ద గడియారమూ, దాని కిరుప్రక్కలా గాంధీ, నెహ్రూల చిత్రపటాలూ... పైన సీలింగ్ ఫేన్ స్పీడుగా తిరుగుతోంది.

ఆ కుర్చీలో ఆశీనులయ్యారు దయానిధిగారు. తిన్నగా వారి దగ్గర కెళ్లి ఎదురుగా నిలబడి ఆఫీసు సూపరింటెంటెంట్ దయానిధి గారికి నమస్కారం చేసా. నా నమస్కారాన్ని స్వీకరించినట్టుగా తలను ఒకసారి కిందకి దింపారు.

వారిలో నచ్చిన మార్పుకి ఆశ్చర్యం వేసింది. అయిదు నెలల క్రితం వరకూ మా ఆఫీసులోనే పనిచేస్తూ వుండేవారు. ప్రమోషన్ మీద ఆ ఆఫీసుకు బదిలీ అయ్యారు. ఎప్పుడూ జోక్సు వేస్తూ నవ్వుతూ నవ్వించే ఆయనలో ఎంతో మార్పు ? గంభీరంగా ఒక అపరిచిత వ్యక్తిని చూసినట్లు చూసారు. అంతా సీటు మహిమ ! ఎదురుగా రెండు ఖాళీ కుర్చీలున్నాయ్ ! కూర్చోమంటారని ఆశించాను. ఏదో ఫైలు చూస్తూ నన్నలా నిలబెట్టారు.... అలా చేస్తేను తన హోదాకి గుర్తింపు లభిస్తుందని అనుకొన్నారేమో! కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయ్. నా వునికిని గుర్తు చేయాలనిపించింది.

"గుడ్ మాణింగ్ సార్ ! నన్ను విశ్వనాథం అంటారు. అనకాపల్లి సబ్ డివిజన్ యూ.డీ.సి.ని." నన్ను నేను పరిచయం చేసుకొన్నా. చటాల్న తలెత్తి చూసారు దయానిధిగారు. నవ్వుమొహం పెట్టారు. వారిలో వచ్చిన మార్పుకి ఆనందించా. కళ్లజోడు తీసి టేబిలుమేద పెట్టి,

"కూర్చోండి ! ఏమిటి గోత్ర నామాలు చెప్పుకొంటున్నారు! ఇదెప్పటినుంచి?"

అడిగారు తెచ్చిపెట్టుకొన్న కలుపుగోరు తనంతో,

"కార్యసాధకుడు తాత్కాలికంగా అభిమానాన్ని చంపుకోవాలి ! అవమానాన్ని భరించాలి!" అవి మా తాతయ్య అనే మాటలు గుర్తుకువచ్చాయ్.

వారికెదురుగా ఖాళీగావున్న కుర్చీలో కూర్చున్నా. పైన ఫేన్ తిరుగుతున్నా చెమట ఆరలేదు. కర్చీఫ్‌తో మొహం తుడుచుకొన్నా. ఆయన మళ్లీ ఫైలులో తల దూర్చారు. ఒక పెద్ద ఆఫీసరుకు అసిస్టెంటుగా వ్యవహరిస్తున్న ఆయన, నేనెందుకు వచ్చానో నా పనేమిటో అడగి తెల్సుకొని సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనకుంది. తనయుడు ఆకలి వేసినప్పుడు మాత్రమే తల్లిని సమీపించడు ! ఏ ఇతర అవసరాలున్నా తల్లి దగ్గరకి వెళ్తాడు. ఆ అవసరం ఏమిటో తనయుడు చెబితేనేగాని, లేక తల్లికి ఏం తెలుస్తుంది ? "ఏం కావాలి బాబూ ?" అని తల్లి ముందుగానే అడిగితే ఆ కుమారునికి కొండంత తృప్తి ! ఆనందం ! తల్లి అడక్కపోయినా తనయుడు తానొచ్చిన పనేమిటో చెప్పుకొంటాడు.

"సార్ !" అన్నా.

"ఒన్ మినిట్! సారీ! ఈ ఫైలు అర్జంటుగా ఆఫీసరుగారికి పంపాలి" అన్నారు ఫైలు చూస్తూనే.

నేను మాట్లాడలేదు.

"చెప్పండి! అన్నారు.

"నా చెల్లెలికి పెళ్లి నిశ్చయం ఐంది!" అన్నా.

"అలాగా! శుభం!" అన్నారు. పొడిగా. "పి.ఎఫ్. అడ్వాన్సుకి అప్లయ్ చేసా ! అన్నా ఆతృతగా వారి మొహంలోకి చూస్తూ.

ఆయన మౌనం వహించారు.

"అప్లయ్‌చేసి నెలరోజులయింది! మూహూర్తానికి వారం రోజులే టైముంది సార్!" అన్నా.

సభ్యత కోసమో లేక మూడుసంవత్సరాలు ఒకే ఆఫీసులో పనిచేసిన రోజులు

గుర్తుకు వచ్చో,లేక మానవత్వం మేల్కొనో, లేక ఒక పెద్ద ఆఫీసరు అసిస్టెంటుకుండాల్సిన బాధ్యతలు గుర్తుకు వచ్చో, ఆయన తన ధోరణిని మార్చుకొన్నారు. చేతిలో వున్న ఫైలును పక్కకు పెట్టి, "మీ అడ్వాన్సు సాంక్షన్ కాలేదా?" ఆశ్చర్యంగా అడిగారు.

"లేదు సార్ ! అందుకోసమే వచ్చా !" అన్నా.

ఎదురుగా కూర్చున్న డీలింగ్ క్లార్కుని పిల్చారు.

"ఏమండీ ! శర్మగారు !" దయానిధిగారి పిలుపు వినిపించనట్లుగా ప్రవర్తించాడు శర్మ. అతను నాకేం కొత్తకాదు. అతనూ నేనూ విజయనగరంలో అయిదు సంవత్సరాలు కల్సి పనిచేసాం. శర్మని ఇదివరలో రెండుసార్లు కల్సాను. తొందరగా చేసి పెట్టమని కోరాను. అలాగే అనేవాడు. కానీ పని చేయలేదు. మరలా అతన్ని కల్సి లాభంలేదని అనిపించింది.

"శర్మగారి దగ్గరకెళ్లండి!" డైరెక్టు చేసారు దయానిధి గారు అయిష్టంగా మొహం పెట్టా శర్మని మరోసారి గట్టిగా పిల్చారు. లేచి వచ్చాడు శర్మ.

"చూడండీ! వీరు పి.ఎఫ్. అడ్వాన్సుకి అప్లయ్ చేసార్ట ! నెలరోజులు..." సగం లోనే అందుకొన్నాడు శర్మ.

"అవునండీ! ఆఫీసరుగారు ముందుగా బడ్జెట్ వర్కు చూడమన్నారు ! అది అయే వరకూ ఏ యితర పనులూ చూడొద్దన్నారు!" నిష్కర్షగా చెప్పి నన్ను నిర్లక్ష్యంగా చూసి తన సీటులోకిపోయాడు శర్మ.

అతని ప్రవర్తనకు విస్తుపోయాను. అంతకు ముందు అతను చూపిన సానుభూతి అంతా నటనే అన్నమాట!.

నిస్సహాయంగా నావైపు చూసారు దయానిధిగారు. ఆ చూపుల్లో తానేమీ చేయలేనన్న అర్థం కల్పించింది.

నాలో నిరాశా నిస్పృహలు ఆవరించాయ్. "ఓసారి ఆఫీసరుగార్ని చూడాలని వుంది సార్!" అన్నా అవకాశాన్ని అర్థిస్తూ. తనపై అధికారిని కల్సితన కష్టసుఖాలు చెప్పుకొనే హక్కు క్రింది వుద్యోగులకు ఎప్పుడూ వుంది. దాన్ని నిరోధించే అవకాశమూ, అధికారమూ ఎవరికీ లేవు ! ఆ సూత్రాలకి కట్టుబడ్డారు దయానిధిగారు.

"సరే చూడండి!" అన్నారు.

లేచి నిలబడ్డా ఆయన నాకన్నా ముందుగా ఆఫీసరుగారి గదిలోకి వెళ్లి వెంటనే తిరిగొచ్చి, "రమ్మంటున్నారు వెళ్లండి!" అన్నారు.

దయానిధిగారికి కృతజ్ఞతలు చెప్పుకొని ఆఫీసరుగారి గదిలో ప్రవేశించా వణుకుతూన్న కాళ్లతో. ఆయన ఏదో ఫైలు చూసుకొంటున్నారు.

"గుడ్‌మాణింగ్ సార్!" అన్నా. చదువుతున్న ఫైలును పక్కకునెట్టారు. "నమస్తే! టేక్ యువర్ సీట్!" ఎదురుగా వున్న కాళీ కుర్చీ చూపారు.

"థాంక్యూసార్!" అన్నా నిలబడే, నే భయపడినంత గంభీరత వారిలో లేదు. చూపుల్లో కాఠిన్యత కన్పించలేదు. మాటల్లో కరకుతనం అంతకన్నా లేదు.

"నా పేరు విశ్వనాథం! అనకాపల్లి యూడీసీని!" అన్నా.

"ఐసీ! ప్లీజ్ బీ సీటెడ్!" అన్నారు.

కుర్చీలో కూర్చున్నా.

"చెప్పండి!" అన్నారు ఆసక్తిగా ముందుకి వంగి.

"అనకాపల్లి యూడీసీని సార్!" అన్నా తడబడ్తూ.

"చెప్పారు కదా! ఎందుకు వచ్చారో చెప్పండి విశ్వనాథంగారూ!" అడిగారు నెమ్మదిగా.

"మా సిస్టరు మారేజి ఈ నెల యిరవై రెండో తారీఖున సార్!' అన్నా.

"చాలా సంతోషం!"

"పి.ఎఫ్. అడ్వాన్సుకి అప్లయ్ చేసి నెల రోజులు అయింది సార్! డబ్బు చాలా అవసరం! అందుకని ....."

నానుస్తూ ఆగిపోయా,

వారి భృకిటి ముడిపడింది.

"శాంక్షన్ కాలేదా? ఆశ్చర్యపోయారు.

"అందుకోసమే వచ్చాను సార్! టైము లేదు! శర్మగారు చాలా బిజీగా వున్నార్!"

చీకాకుగా మొహం పెట్టారాయన. కాలింగ్ బెల్ స్విచ్ నొక్కారు. ప్యూన్ వచ్చాడు మరుక్షణం "శర్మగార్ని పిలువ్ అన్నారు. శర్మగారు వచ్చాడు. వినయంగానిలబడ్డాడు.

"వీరి పి.ఎఫ్. అడ్వాన్సు అప్లికేషన్ వచ్చిందా?"

సీరియస్‌గా అడిగారు.

"వచ్చిందార్! బడ్జెట్ వర్కు ముందు చూడమన్నారని..." నీళ్లు నమిలాడు శర్మ ఆఫీసరుగారి మొహం జేవురించింది.

"బడ్జెట్ వర్క్ మూడురోజులుపట్టింది. అంతేగా ? అది డిస్పాచయి వారం రోజులయింది. వీరి అప్లికేషన్ మనకు చేరి నెల రోజులయింది. లోన్స్ అండ్ అడ్వాన్సెస్ యితర పర్సనల్ క్లెయిమ్సూ వీటిని ఎప్పుడూ డిలే చేయొద్దని మీకు ఇదివర్లో చాలాసార్లు చెప్పాను. అ డబ్బుతో తమ తమ అవసరాలు తీర్చుకోవాలని ఆరాట పడ్తూవుంటారు. దానిమీద ఎన్నో ఆశలు పెట్టుకొని వుంటారు. అవసరానికి అందకపోతే ఎన్నో అవస్తలు పడాల్సి వస్తుంది! మీ అప్లికేషన్ ఇంత డిలే అయితే మీకెలా వుంటుంది? ఇంకా ఎన్ని అప్లికేషన్సు వున్నాయ్?" కుపితులయ్యారు ఆఫీసరుగారు.

ఖిన్నుడయ్యాడు శర్మ

నాకు భయం వేసింది.

"రెండే రెండు సార్! వీరిదీ, విన్సెంటు గారిదీ!" తగ్గు స్వరంలోచెప్పాడు శర్మ.

"విన్సెంట్‌గారంటే యూనియన్ అసిస్టెంటు సెక్రటరీగారేనా ?"

"ఎస్సార్!"

ఆఫీసరుగారి మొహం వివర్ణమయింది. కోపం ద్విగుణీకృతం అయింది.

శర్మ భయపడ్డాడు.

మా డిపార్టుమెంటులో కూడా రైవల్ యూనియన్‌వుంది. ఒకటి అవునంటే రెండోది కాదంటుంది. ఒక యూనియన్ సభ్యులంటే రెండో యూనియన్ సభ్యులకి ద్వేషభావం! రైవలరీ! వెంజీన్స్! ఒకరినొకరు పరోక్షంలో నిందించుకొంటారు,

దూషించుకొంటారు. అయితే స్వయంగా కల్సుకొన్నప్పుడు అభిమానాన్ని అప్యాయతనీ చిలకరించుకొంటూ పలకరించుకొంటారు. కానీ చేతల్లో పగ! ద్వేషం!! నేనూ విన్సెంటూ ఒక యూనియన్‌కి చెందినవాళ్లం. రెండో యూనియన్ సభ్యులు శర్మా, దయానిధిగారులు. మాయిద్దరి అడ్వాన్సులూ డిలేకావడానికి రైవలరీయే కారణమా? శర్మ అంత అధమ స్థితికి దిగజారాడంటే నమ్మశక్యంగా లేదు. ఆశ్చర్యంగా వుంది.

"మిష్టర్ శర్మా!" ఘర్జించారు ఆఫీసరు గారు

తలెత్తి భయంగా చూసాడు శర్మ.

"వీరి రెండే మిగిలాయా?" మరలా అడిగారు.

"అవున్సార్"

"యూనియన్ ఆక్టివిటీస్‌కీ పాలిటెక్సుకీ ఆఫీసు పనులకీ సంబంధం వుండకూడదు ! ఇక్కడ యూనియన్ పాలిటిక్స్ ప్లే చెయ్యకూడదు! థింగ్స్ షుడ్ గో అకార్డింగ్ టూ మెరిట్ అండ్ అర్ ప్రయారటీ, అండర్‌స్టాండ్!" హుంకరించారు.

"అదికాద్సార్!" ఏదో చెప్పబోయాడు శర్మ.

"నో! నో ఎక్స్ప్లనేషన్! మీ దగ్గరున్న అప్లికేషన్లన్నింటినీ యిప్పుడే నాకు పంపండి!"

"ఎస్సార్!" అనేసి బయటపడ్డాడు శర్మ. లేచి నిలబడి నమస్కరించాను.

"ఆఫీసులో కూర్చోండి!" అన్నారు.

మరోసారి నమస్కరించి హాల్లోకి వచ్చాను. దయానిధిగారితో ఏదో మాట్లాడి తన సీటులోకి వెళ్తున్నాడు శర్మ. దయానిధిగారి కెదురుగ కుర్చీలో కూర్చున్నా. దయానిధి ఏమీ అడగలేదు.

"ఆఫీసరుగారు వెయిట్ చెయ్యమన్నారు!" నేనే చెప్పా.

"శర్మ చెప్పాడు. కూర్చోండి!" అన్నారు. ఆయన తన పని చూసుకొంటూవుంటే టేబిలు మీదనున్న టెలిఫోన్ డైరక్టరీని చూస్తూ కూర్చున్నాను.

లంచ్ అవర్ అయింది. గుమాస్తాలు తమ తమ కుర్చీల్లోంచి లేచి బయటకు

వెళ్తున్నారు. దయానిధిగారు కూడా లేచారు. శర్మ కూడా బయటకు వెళ్తాడేమోనని అనుమానం వచ్చి అతనివైపు చూసా. ఆ రోజు శాంక్షన్ అయితే మర్నాడు కేష్ చేసుకోవచ్చు. లేకపోతే వరసగా మూడు రోజులు శెలవులు. నాకు డబ్బు చాలా అవసరం. చటాల్నసీటులోంచి లేచినిలబడ్డాడు శర్మ. నాలో నిరాశ ఆవరించింది. అతని దగ్గరకెళ్లి రిక్వెస్టు చేద్దామనుకొన్నా. కానీ వెళ్లలేకపోయాను. నామూలంగా ఆఫీసరు గారిచేత చీవాట్లు తిన్నాడు. ఫైల్సు తీసుకొని ఆఫీసరుగారి గదిలోకి వెళ్లి అయిదు నిమిషాల్లో ఫైల్సుతో తిరగి వచ్చాడు. తన మూమెంట్సును నేను గమనిస్తున్నట్లు తెల్సుకొన్నాడు. నాదగ్గరకొచ్చి, "మీ అడ్వాన్సు శాంక్షన్ అయింది! టైపుకిచ్చా కొంచెం వెయిట్ చెయ్యండి!" అన్నాడు.

"థాంక్యూ మిస్టర్ శర్మా!" అన్నా.

"కాఫీ తాగివస్తా!" అంటూ బయటకు నడిచాడు.

అతనివైపే చూస్తూంటే ఎవరో నా బుజంమీద చెయ్యి వేసారు. వెనక్కు తిరిగి చూసా. రామరాజు! రామరాజు మా (యూనియన్) వాడే.

"ఏవిటిలా వచ్చేరు ?" అడిగాడు.

జరిగింది చెప్పా. అంతా విని, "అవును ! దయానిధి కాంటీన్‌లో పెద్దగా చెబుతున్నాడు. వాళ్లమీద రిపోర్టు చేసార్ట! మంచి పనిచేసారు ! మీ ధైర్యానికి మా జోహార్లు! రండి కాఫీ తాగుదాం!" చేయి పట్టుకొని లేవదీసాడు. మా ఇద్దరితో మరో మరో డజను మంది "మా వాళ్లు" కల్సారు నేనేదో ఘనకార్యం చేసినట్టుగా నన్ను అభినందించడం మొదలుపెట్టారు. నా అవసరం కొద్దీ ఆఫీసరుగార్ని అర్ధించడానికి వెళ్లాను. కానీ కథ మరో మలుపు తిరిగింది. దాన్ని ఆసరాగా ప్రచారం చెయ్యడానికి వుపక్రమించారు మా వాళ్లు. అంతా కాంటీన్ సమీపించాం.

మేము కాంటీన్ మెట్లెక్కుతూంటే ఆ గ్రూప్ వారంతా కిందకి దిగివస్తూ ఎదురయ్యారు. నాకు భయం పుట్టుకొచ్చింది. ఏ అననుకూల మేఘాలు ముసురుకొంటాయో! ఏ ఘర్షణ చినుకులు రాలతాయో !

అయితే నా అదృష్టంకొద్దీ ఏమీ జరగలేదు. పద్నాలుగు కాఫీలకి ఆర్డరిచ్చాడు రామరాజు. డబ్బు చెల్లించబోయాడు. అతి కష్టంమీద అతనిని ఒప్పించి ఆ బిల్లు

నేనే చెలించా. అంతా కాఫీలు తాగుతూంటే కొంచెం నిశ్శబ్దం ఆవరించింది. ఆ అవకాశాన్ని వినియోగించుకొన్న.

"నా కర్జంటుగా డబ్బు కావాలి ! తొందరగా సాంక్షన్ చేయమని ఆఫీసరుగార్ని అర్థించడానికి వెళ్లా. ఆలస్యం చేసినందుకు ఆయన శర్మగారిని కొంచెం మందలించారు. అంతే! ఇదేమీ ఎచీవ్మెంటు కాదు! దీనికి పబ్లిసిటీ యివ్వకండి! వాతావరణాన్ని కలుషితం చెయ్యకండి! ప్లీజ్!" బ్రతిమాలాను.

"ఏమైనా మిమ్మల్ని అభినందించక తప్పదు!" అన్నాడు రామరాజు.

"ఈ విషయాన్ని యింతటితో వదిలేయండి! ప్లీజ్!" మరోసారి బ్రతిమాలాను.

తిరిగి అందరమూ ఆఫీసు హాల్లో అడుగుపెట్టాం. దయానిధిగారి కెదురుగా మౌనంగా కూర్చున్నా. శర్మ సాంక్షన్స్ తెచ్చి దయానిధిగారి కందించాడు. వాటిని పరిశీలించి నా కాపీ అందిస్తూ.

'తీసుకోండి!" అన్నారు.

రెండోది విన్సెంటుది. ఆయన అప్లయ్ చేసినట్లు నా కంతవరకూ తెలియదు.

"విన్సెంటుగారిది కూడా యిస్తే తీసుకొని వెళ్తా!" అన్నా.

"మీది మీరు తీసుకొనివెళ్లండి! వారిది పోస్టులో పంపిస్తాం!" అన్నారు కరకుగా.

"మూడు రోజులు శలవు కదా! నా చేతికిస్తే రేపు కాష్ అవుతుంది!" అన్నా.

"మీ చేతికివ్వగూడదని కాదు! ఒకవేళ పోయిందనుకోండి! అహా! పోతుందని కాదు మిస్‌ప్లేస్ అయిందనుకోండి మా కర్మకొద్దీ! మా మీద కొస్తుంది! చూస్తున్నారుగా! ఆఫీసరుగారు అగ్గిపిడుగులాంటి మనిషి!"

నేనిక మాట్లాడలేకపోయా, నా శాంక్షన్ ఆర్డరు తీసుకొని బయలుదేరా. దయానిధి ఆ విధంగా ఎందుకు ప్రవర్తించారో నాకు తెల్సు. నాది కేవలం అపోహ అయితే కావచ్చు!

రెండు నెల క్రితం దయానిధిగారు తన కూతురి పెళ్లికి ఒక సత్రాన్ని ఉచితంగా బుక్ చేసుకొన్నారు. ఆ సత్రం యజమాని రామిశెట్టి ఆ పట్టణంలో పేరుపడ్డ

వ్యాపారస్తుల్లో ఒకరు. పెళ్లి వారంరోజులుండనగా ఒక సంఘటన జరిగింది.

విన్సెంటుగారి మేనకోడలుకి కాలేజీలో సీటు దొరకలేదు. ఆ సందర్భంలో నేనూ, విన్సెంటుగారు రామిశెట్టి గారింటికి వెళ్లాం. వారితో మాట్లాడి గుమ్మం దిగుతుంటే గుమ్మంలో దయానిధిగారు కన్పించారు. వారిద్దరూ అప్యాయంగా పలకరించుకొన్నారు. సత్రం గురించి రామిశెట్టి గారితో మాట్లాడటానికి వెళ్తున్నాని చెప్పారు దయానిదిగారు. ఆ తర్వాత అనుకోని విచిత్ర సంఘటన జరిగింది.

ముందు సత్రం యిస్తానన్న రామిశెట్టి దయానిధిగారింట్లో పెళ్లినాటికి ఈయడం కుదరదని చెప్పాట్ట! అదే రోజున మినిష్టరుగారి ప్రోగ్రాం ఫిక్సయిందని చెప్పారుట మరో పెద్ద యిల్లు చూసుకొని దయానిధిగారు అమ్మాయి పెళ్లి జరిపించారు. మినిష్టరుగారి ప్రోగ్రాం కాన్సిల్ అవడంతో ఆ రోజు ఆ సత్రం కాళీగా వుండిపోయింది. సత్రం రిజర్వేషన్ కాన్సిల్ కావడానికి కారకులం మేమే అని దయానిధిగారు అపోహపడ్డారు. మానవత్వం లేని మనుషులం అని చాలామంది దగ్గర నిందించారుటకూడ.

మర్నాడు నా బిల్ కేష్ చేసుకున్నా. తనది కూడ శాంక్షన్ అయిందనీ పోస్టులో పంపుతానన్నారని విన్సెంట్‌కి చెప్పాను.

"నా కంత తొందరలేదోయ్! సిమ్మెంటింకా శాంక్షన్ కాలేదు. నెల రోజులు పడ్తుదంటున్నారు. నీది తెచ్చుకొన్నావ్ కదా!" అన్నాడు ఈజీగా విన్సెంట్.

విన్సెంట్ ఇల్లు కడుతున్నాడు.

❖ ❖ ❖ ❖ ❖

దయానిధిగారికి అనకాపల్లి నుంచి విశాఖపట్నం ట్రాన్సఫర్ అయి ఐదు నెలలయింది. సీజన్ టికెట్ మీద తిరుగుతున్నారు. పిల్లల చదువులు పాడవుతాయనీ ఆ తర్వాత వైజాగ్ ఖర్చులకి భయపడి. పెద్దమ్మాయి పెళ్లికి తునిలో వున్న తన యింటిని అమ్మేసారు. అవసరానికి అమ్మడం వల్ల యిరవై వేలు వస్తుందనుకొన్న యిల్లు పదహారు వేలకే అమ్మవలసివచ్చింది. ఇల్లు కొన్న పెద్ద మనిషి యింకా రెండు వేలు బాకీ పెట్టాడు. బెల్లం అమ్మి నాలుగైదు వారాల్లో యిస్తానన్నాడు.

రెండు నెలలయినా బాలన్సు యివ్వలేదు. ఈలోగా పెద్దబ్బాయి ప్రకాష్‌కి బ్యాంకులో వుద్యోగం వచ్చింది. వెయ్యి రూపాయలు డిపాజిట్ చేసి వుద్యోగంలో చేరమన్నారు. రెండు రోజులే గడువుంది. డబ్బు కోసం కొడుకుని తుని పంపారు. వాడు యివ్వకపోతే తనయుని భవిష్యత్తు పాడవుతుంది. ఆలోచనలతో ఆ రాత్రి యిల్లు చేరారు దయానిధిగారు. ఇంట్లో అడుగుపెట్టగానే భార్య మాలతి చెప్పింది. "వాడు డబ్బు యివ్వలేదని."

నవనాడులూ కృంగిపోయి కుర్చీలో కూలబడ్డారు దయానిధిగారు.

"ప్రకాష్ ఏడీ ?" అడిగారు.

"వాళ్ల స్నేహితుడు విక్టర్ దగ్గర కెళ్లాడు!"

"విక్టర్ అంటే ఆ విన్సెంట్ గారబ్బాయా ?"

"అఁ ఆయనే! విక్టర్ తన తండ్రితో చెప్పాట్ట! అదిగో ఆ యిద్దరూ వస్తున్నారు!" ఎదురుగా వస్తూన్నవాళ్లని చూసి ఆగిపోయింది మాలతి.

ప్రకాష్ తన స్నేహితుడు విక్టర్‌తో గదిలో ప్రవేశించగానే -

"రావోయ్ విక్టర్! ఏవిటీమధ్య రావడం మానేసావ్ ?"

ఆప్యాయంగా పలకరించారు దయానిధిగారు.

"ఎమ్మేకి కట్టానండి! చదువుకొంటున్నా!" వినయంగా చెప్పాడు విక్టర్.

"బాబూ! ప్రకాష్‌కి బ్యాంకులో వుద్యోగం వచ్చింది!" చెప్పింది మాలతి

"అవునండీ ! ప్రకాష్ అంతా చెప్పాడు ! డబ్బు విషయం నాన్నగారితో చెప్పాను. సోమవారం నాన్నగారికి డబ్బు అందుతుందట! డిపాజిట్ డబ్బు సర్దుతామన్నారు.

మీ ఇంటి డబ్బు అందగానే తిరిగి యిచ్చేయెచ్చు!"

విన్సెంట్ వితరణకి విస్తుపోయారు దయానిధి.

విశ్వనాథం చేతికి అతని ఆర్డరు కూడా యిచ్చివుంటే విన్సెంట్ ఈరోజు డబ్బు ఇచ్చి వుండేవాడు ! కానీ విన్సెంట్‌కి సోమవారం కూడా డబ్బు అందదే!

శాంక్షన్ ఆర్డరు యింకా పోస్టు చేయలేదు. రెండు రోజులు శెలవులనంతరం సోమవారం నాడు డిస్పేచ్ చేస్తే మంగళవారం నాటికి అందుతుంది! ఆ రోజుకి బ్యాంకు వారిచ్చిన గడువు తీరిపోతుంది! అప్పుడు డబ్బు అందీ ప్రయోజనం లేదు. విన్సెంట్‌కి సోమవారం నాటికే డబ్బు అందాలి! ఎలా? తనెంత పొరపాటు చేసాడు!" అనుకున్నారు. తనను తాను నిందించుకొన్నారు. ఆ తర్వాత ఆలోచనలో పడ్డారు. సోమవారం ఉదయమే ఆరుగంటల ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి తమ ఆఫీస్ ప్యూన్‌చేత ఆ శాంక్షన్ ఆర్డరు పంపాలని నిశ్చయించుకొన్నారు.

సోమవారం ఉదయం ఎనిమిదికల్లా ఆఫీసు చేరుకొన్నారు దయానిధిగారు. అప్పటికే ఆఫీసులో శర్మ వచ్చి వున్నాడు.

"విన్సెంట్ శాంక్షన్ ఆర్డరు శ్రీకాకుళం ఆఫీసు కవరులోపెట్టి డిస్పేచ్ చేసా! విన్సెంట్, వాళ్ళు తిరిగి పంపేసరికి మూడు నాలుగు రోజులు పడుతుంది! ఆ డిలే అంతా డిస్పేచ్ క్లార్కు ఈశ్వరరావుమీద పడుతుంది అతను వాళ్ల వాడే కదా!"

నెమ్మదిగా, ఆనందంగా తాను చేసిన ఘనకార్యాన్ని చెప్పి దయానిధిగారి మెప్పు పొందాలని ప్రయత్నించాడు శర్మ.

దయానిధిగారి తల బొప్పికట్టింది. మొహం చెమట పట్టింది. పై మీది వుత్తరీయంతో చెమట తుడుచుకొన్నారు. గురువుగారి అవస్త చూసి, భయపడ్తున్నారని భ్రమించాడు శర్మ. ధైర్యం చెప్పాలనుకొన్నాడు.

"మీకేం భయంలేద్సార్! డిస్పాచ్ క్లార్కు చేసినదానికి మనం బాధ్యులం కాదు!" అన్నాడు.

"స్పేర్ కాపీ వుందా ?" అడిగారు కంగారుగా.

"లేద్సార్!" ఠకీమని సమాధానం చెప్పాడు శర్మ. గురువుగారు భయపడ్తున్నారని నిర్ధారించుకొన్నాడు.

"అమ్మాయి పెళ్లికి రిజర్వు చేసుకొన్న సత్రాన్ని లేకుండా చేసాడు! అతనిలో మానవత్వం వుందంటారా ? మనకెందుకు సార్ భయం? అది అందినప్పుడే అందుతుంది!" ధైర్యం చెప్పాడు మరోసారి.

మౌనంగా తన సీటులో కూలబడ్డారు దయానిధిగారు. ఆలోచనలో పడ్డారు. అర్జంటుగా వెయ్యి రూపాయలు కావాలి! కూతురి పెళ్లికే దొరికినచోటల్లా అప్పు చేసారు. విన్సెంట్ డబ్బు సర్దలేదు! తనయునికి ఉద్యోగం దొరకదు! భార్య మెడలో పుస్తే పూసా అమ్మేసైనా డబ్బు తేవాలి! ఆఫీసుకు సెలవు పెట్టి బయలుదేరారు. తిరిగి యిల్లు చేరేసరికి పన్నెండు గంటలయింది. ప్రకాష్ పెట్టె బెడ్డింగూ సర్దుకొంటున్నాడు. విన్సెంటు డబ్బు సర్దలేదని వాడికి తెలీదు! జాలిగా చూసారు. పెరట్లో వున్న భార్యను సమీపించారు.

"అబ్బాయి ప్రయాణం అవుతున్నట్టుంది!" అన్నారు భార్యతో.

"పాపం విన్సెంట్ గారి ఈ రోజు అడ్వాన్సు ఐదు వేలు అందాలట! అందలేదుట! మహానుభావుడు! ఇంటికోసం వుంచిన ఐదు వందలూ ఎక్కడో అప్పు తెచ్చి మరో ఐదు వందలూ కలిపి వెయ్యి రూపాయలు యిచ్చార్ట!" చెప్పింది మాలతి.

దయానిధిగారు మనసు కుదుటపడింది. విన్సెంట్‌కి మనసులో కృతజ్ఞతలు చెప్పుకొన్నారు.

"మనషుల్లో మానవత్వం యింకా వుంది సుమండీ!" అంది మాలతి.

"మనుషులందరిలోనూ మానవత్వం వుందనుకోవడం పొరపాటు మాలతీ!" అనేసి యింట్లోకి పోయారు దయానిధిగారు.

భర్త మాటలు ఆమెకు అర్థంకాలేదు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

(దీపావళి కథల పోటీలో బహుమతిపొందిన కథ)

తేది 6-11-1981